# సునీల్‌రెడ్డి బాండ్‌పేపర్ ఓ మోసం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మధుశేఖర్, పక్కన కోటపాటి నర్సింహనాయుడు

- ప్రజలను మభ్యపెట్టేందుకే దివాలా కోరు రాజకీయం
- నాడు అర్వింద్.. నేడు అదే బాటలో సునీల్
- ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌ను నమ్మడం లేదని సునీల్ ఒప్పుకున్నట్లే..
- బాండ్ పేపర్ చీఫ్ ట్రిక్కును ప్రజలు నమ్మొద్దు
- అభివృద్ధికి బ్రాండ్ మంత్రి వేముల
- సునీల్‌రెడ్డి, బాండు పేపర్‌పై బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ మధుశేఖర్, కోటపాటి ఆగ్రహం

వేల్పూర్, నవంబర్ 27: బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి ఆ పార్టీ ఆరు గ్యాంరెంటీలకు తన హామీ అంటూ విడుదల చేసిన బాండు పేపర్ ఓ మోసపూరిత రాజకీయమని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు మండిపడ్డారు. సోమవారం వారు వేల్పూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని నెల రోజులుగా తన ప్రచార కార్యక్రమాల్లో సునీల్‌రెడ్డి గ్రహించాడని తెలిపారు.అందుకే ఆరు గ్యారెంటీలపై సొంత బాండ్ పేపర్ డ్రామాకు తెర లేపాడని, తద్వారా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీని ప్రజలు ఏమాత్రం విశ్వసించడం లేదని సునీల్‌రెడ్డి ఒప్పుకున్నట్లే అని పేర్కొన్నారు. గతంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ధర్మపురి అర్వింద్ బాండ్ పేపర్ రాసిచ్చి నాలుగున్నరేండ్లుగా రైతులను మోసం చేస్తున్న ఫార్ములాను నేడు సునీల్‌రెడ్డి అనుసరిస్తున్నాడని అన్నారు.బాండ్ పేపర్ చీఫ్ ట్రిక్కును ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

**వేములు చేసిన అభివృద్ధి కళ్ల ముందే ఉంది..**

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి కళ్ల ముందే ఉందన్నారు. అభివృద్ధికి ప్రశాంత్‌రెడ్డి బ్రాండ్‌గా నిలిచారన్నారు. పని చేసిన వారిని వరుసగా నాలుగు సార్లు గెలిపించిన చరిత్ర బాల్కొండ నియోజకవర్గ ప్రజలదని పేర్కొన్నారు.రెండుసార్లు వరుసగా గెలిచిన ప్రశాంత్‌రెడ్డిని ఈసారి కూడా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు అమలు చేయలేక అక్కడి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. కరెంట్‌ను ఐదు గంటలు కూడా సరిగ్గా ఇవ్వకుండా రైతులను మోసం చేసిందన్నారు. కడుపు మండిన కర్ణాటక రైతులు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలను నమ్మవద్దని తెలంగాణ ప్రజలకు హితవు పలుకుతున్నారని గుర్తు చేశారు. కర్ణాటక రైతులు మన హైదరాబాద్‌కు వచ్చి కర్ణాటకలో కాంగ్రెస్ చేసిన మోసాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారన్నారు. సునీల్‌రెడ్డికి అధికార యావనే తప్ప రాజకీయంగా నిలకడ లేని చరిత్ర అని విమర్శించారు. ఐదేండ్లలో ఐదు పార్టీలు మారిన నిలకడ లేని సునీల్‌రెడ్డిని నమ్మితే మోసపోతామన్నారు. 24 ఏండ్లుగా ఒకే పార్టీని, ఒకే నాయకుడిని నమ్ముకున్న ప్రశాంత్‌రెడ్డి నిలకడ, కమిట్‌మెంట్ ఉన్న నాయకుడని పేర్కొన్నారు. సునీల్‌రెడ్డి బాండ్ పేపర్‌ను పిల్లచేష్టగా అభివర్ణించారు. అబద్ధాలు ఆడకూడదనే పవిత్ర కార్తీక పౌర్ణమి నాడు అబద్ధాల బాండ్ పేపర్‌ను విడుదల చేశాడని దుయ్యబట్టారు. బీఎస్పీని వాడుకుని ఓట్ల కోసం బహుజనులను మోసం చేశాడన్నారు. ధర్మపురి అర్వింద్ బాండ్ పేపర్ వైనాన్ని గుర్తు పెట్టుకుని సునీల్ బాండ్ పేపర్ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజలు నమ్మడంలేదు**

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదని, బాండ్ పేపర్ ద్వారా సునీల్‌రెడ్డి చాటి చెప్పాడన్నారు. కర్ణాటకలో ప్రతి మహిళకు రెండు వేల రూపాయల పథకాన్ని 90 లక్షల మంది మహిళలకు ఇస్తామని ఓట్లు వేసుకున్న కాంగ్రెస్ కేవలం 10 లక్షల మందికి ఒకనెల మాత్రమే ఇచ్చి ఎగ్గొట్టిందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ చేసిన మోసాలపై కర్ణాటక ప్రజలు, రైతులు చేస్తున్న నిరసనలు, విమర్శల వీడియో క్లిప్పింగ్‌లను మీడియా ముందు ప్రదర్శించారు. సమావేశంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, డీసీసీబీ వైస్‌చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ.రాజేశ్వర్, వేల్పూర్ ఎంపీపీ బీమా జమున, జడ్పీటీసీ అల్లకొండ భారతి పాల్గొన్నారు.

**ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన వేముల**

బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయడమే కాకుండా తన వ్యక్తిగతంగా కరోనా ఆపద కాలంలో దవాఖానలకు శాశ్వతంగా ఆక్సిజన్, బెడ్‌ల సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు.12 వేల మంది యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, హెల్మెట్లు ఉచితంగా అందజేశారన్నారు. అత్యాధునిక అంబులెన్స్ వాహనాన్ని అందుబాటులో ఉంచారన్నారు. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, భోజనం, ప్రిపరేషన్ మెటీరియల్ అందజేశారని వివరించారు.ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు.

## ఘనంగా పుష్పయాగం

భీమ్‌గల్, నవంబర్ 27 : మండలంలోని నింబాచల క్షేత్రంపై కార్తీక వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి శ్రీలక్ష్మీ నరసింహుని పుష్పయాగం వైభవోపేతంగా జరిగింది. శ్రీలక్ష్మీ నృసింహుని ఉత్సవ విగ్రహాలను పల్లకిలో పుష్కరిణి మంటపానికి తీసుకువచ్చి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరత్నాలు పొదిగిన స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. వివిధ రకాల పరిమళ భరిత పుష్పాలతో వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి పుష్పయాగం నిర్వహించారు.

## తూము కాలువల మరమ్మతు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

కమ్మర్‌పల్లి, నవంబర్ 27 : మండలంలోని నాగపూర్ గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఊరచెరువు కాలువలు, తూము మరమ్మతులను ఎంపీటీసీ దుబ్బాక సుప్రియ, సర్పంచ్ పాలెపు సాయమ్మ సోమవారం ప్రారంభించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ప్రెసిడెంట్ చింత శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ బసకొండ మహేశ్, నీటిపారుదల అధ్యక్షుడు ఎలిగేటి గణేశ్, ఆయకట్టు రైతులు మల్లేశ్, శ్రీనివాస్, మనోజ్, రవికిరణ బాలు, మల్లయ్య, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## కేసీఆరే మళ్లీ రావాలని కోరుతూ.. దీపాలను వెలిగించిన మహిళలు

మెండోరా, నవంబర్ 27 : శాసనసభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేలందరూ గెలిచి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ పోచంపాడ్ గ్రామంలోని అమ్రాయి కాలనీలో సోమవారం మహిళలు వినూత్నరీతిలో దీపాలను వెలిగించి అభిమానం చాటుకున్నారు.దీపాలను వెల్‌కం, బీఆర్‌ఎస్, కేసీఆర్, వీపీఆర్ అని వరుస క్రమంలో వెలిగించి అందరినీ ఆకర్షింపజేశారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మండల నాయకులు, కార్యకర్తలు ఆశ్చర్యానికి గురయ్యారు. కాలనీవాసులంతా కారు గుర్తుకే ఓటు వేస్తామని స్పష్టం చేశారు. దుర్గాప్రసాద్, నర్సింహ, అరవింద్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- తులసీ పూజలు, దీపారాధన



ఆర్మూర్ పట్టణంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మాక్లూర్‌లో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ముప్కాల్‌లో తులసీపూజలో పాల్గొన్న మహిళలు

మాక్లూర్, నవంబర్27: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం కార్తిక పౌర్ణమి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తులసీచెట్టు వద్ద అరటి, చెరుకు కొమ్మలతో పందిరి వేసి పూలతో అలంకరించి సుహాసినులు దీపాలు వెలిగించారు. అనంతరం సుహాసినులకు పసుపు, కుంకుమలు అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

**ఆర్మూర్ పట్టణంలో..**

ఆర్మూర్‌టౌన్, నవంబర్27: పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం కార్తిక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాలు, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయాల వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

**ముప్కాల్ మండలంలో..**

ముప్కాల్ నవంబర్ 27 : మండలంలో కార్తిక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. తులసీ పూజలు నిర్వహించి దీప దానం చేశారు. మహిళలకు వాయినాలు ఇచ్చి శివారాధన చేశారు.

## దైవనామ స్మరణకు సమయం కేటాయించాలి

**లింగేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్**



కందకుర్తిలో పిట్ల కృష్ణ మహరాజుకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

రెంజల్, నవంబర్ 27: ప్రతి ఒక్కరూ దైవనామ స్మరణ చేసేందుకు సమయం కేటాయించాలని లింగేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ భక్తులకు సూచించారు. సోమవారం నిజామాబాద్ మండలం మల్లారం నుంచి లింగేశ్వర ఆలయం వ్యవస్థాపకులు బాలయోగి పిట్ల కృష్ణ మహరాజ్ కార్తిక మాస దీక్షల విరమణ అనంతరం చేట్టిన పాదయాత్ర ఎడపల్లి మండలం మీదుగా రెంజల్ మండలం కందకుర్తి త్రివేణి సంగమానికి చేరుకుంది. ఎడపల్లి, రెంజల్ మండలాల్లో మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. త్రివేణి సంగమాన్ని చేరుకున్న పిట్ల కృష్ణ మహరాజ్ పుష్కర ఘాట్లపై భక్తులు వెలిగించిన లక్ష దీపోత్సవాన్ని తిలకించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.. పాశ్చాత్య దేశాల మోజులో పడిన నేటి యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దూరంగా బతుకుతున్నారని, ప్రతి ఒక్కరూ నిత్యం దైవ స్మరణ చేస్తే భగవంతుడు మెచ్చిన జీవితాన్ని గడుపగలుగుతారని కృష్ణ మహరాజ్ సూచించారు. ఈపాద యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎడపల్లి మీదుగా పాదయాత్రగా వెళ్తున్న లింగేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు కృష్ణ మహరాజ్

**ఉదయం 5 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర**

ఎడపల్లి, నవంబర్ 27: మల్లారం లింగేశ్వర ఆశ్రమం నుంచి ఉదయం 5 గంటలకు బయల్దేరిన పాదయాత్ర ఎడపల్లి మండలం కుర్నాపల్లి, మంగళ్‌పాడ్, ఎడపల్లి, షటాపూర్ మీదుగా కందకుర్తికి చేరుకుంది. కందకుర్తిలో సామూహిక గంగా హారతి నిర్వహించారు.